ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (మురమళ్ళలో శ్రీనాన్నగారి ప్రవచనము, 25-11-97)

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

సత్సంగము వలన ప్రాపంచిక విషయములతో ఉన్న సంబంధం తొలగుతుంది. ఆధ్యాత్మిక విషయం మీరు అనుకొన్నంత కష్టంకాదు. మనకు సహనం ఉంటే అనుకొన్నది సాధించవచ్చు. వివేకం చాలా ముఖ్యం. వివేకవంతులను చూస్తూ మనం కూడా వివేకాన్ని సంపాదించుకోవాలి. అదేవిధంగా ఎవరికైనా సహనం ఉంటే, మంచితనం ఉంటే అది చూసి మనం కూడా నేర్చుకోవాలి. మనం ఏదైనా పనిచేస్తే దానికి ఫలితం వస్తుంది. ఆ ఫలితం శాశ్వతంగా ఉండదు. అనుభవిస్తే అది పోతుంది. శాశ్వతంగా ఉండేది, మనలను ప్రకృతి నుండి, దుఃఖంనుండి విడుదల చేసేది ఆత్మవిద్య. ఆత్మవిద్య ద్వారా మనం ఆత్మను తెలుసుకొంటాము. ఆత్మ అంటే ఎవరో అనుకొంటాము ఆత్మ అంటే మనమే. దేహాన్ని నేను అనుకోవటం వలన, దేహము యందు ఆత్మబుద్ధి కలిగి ఉండటం వలన మనకు కోరిక వస్తుంది. మానవుడికి మంచి కోరిక వచ్చినా, చెడు కోరిక వచ్చినా దానికి దేహమే కేంద్రం. దేహానికి పరిమితమైన బుద్ధి ఉన్నంత కాలం నీకు కోరికలు వస్తాయి. కోరిక నెరవేరితే గర్వం వస్తుంది, నెరవేరకపోతే దుఃఖం వస్తుంది. ఈ రెండూ కూడా నీమనస్సును సమానంగా ఉండనివ్వవు. ఆధ్యాత్మిక మార్గంలో పూజలు, జపాలు, ధ్యానాలు చేయమని మన పెద్దలు చెప్పిన మనకు మానసిక క్రమశిక్షణ అవసరం. మన మనస్సులోనికి చెడుతలంపులు రాకుండా చూసుకోవాలి. అప్పడు మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుంది. మనస్సు పరిశుద్ధమవుతుంది. బ్రహ్మం పరిశుద్ధమైనది. కాబట్టి నీ మనస్సు పరిశుద్ధమైతే అప్పడు ఈ మనస్సే బ్రహ్మాకారం చెందుతుంది. అందువలన మనస్సును బాగు చేసుకోవటంలో అశ్రద్ధ పనికిరాదు. అజ్ఞానం, అశాంతి, కోరిక, దుఃఖం అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు నశిస్తే అన్నీ నశిస్తాయి. నీవు ఏ గురువును ఆశ్రయించినా, ఏమార్గంలో ప్రయాణం చేసినా మనస్సు నశించకపోతే అజ్ఞానం నశించదు.

నీవు మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది. అది అనుభవిస్తే పోతుంది. నీవు కోటి మంచి పనులు చేసినా నీకు జ్ఞానం కలుగుతుంది, అని నిర్ధారణ లేదు. నీకు వివేకం లేకపోతే, ఏది ఆత్మ ఏది అనాత్మ, ఏది సత్యం ఏది అసత్యం అనే వివేకం లేకపోతే, సూక్ష్మబుద్ధి లేకపోతే కోటి జన్మలు ఎత్తినా నీకు జ్ఞానం కలుగదు. జ్ఞానం కలుగకపోతే నీకు మోక్షం లేదు అంటున్నారు, ఆచార్యులవారు. ప్రాపంచికభోగాలు ఎన్నిఉన్నా ఆత్మవిద్య లేకపోతే శవాన్ని అలంకరించినట్లుగా ఉంటుంది. అనవసరమైన ఖర్చులు తగ్గించుకొంటే అది కూడా తపస్సుతో సమానము. మిగిలిన డబ్బును ఇతరులకు సహాయం చేయవచ్చు. దానికి భగవంతుడు సంతోషిస్తాడు. దాని వలన ఇతరులు బాగు పడతారు. మనం కూడా బాగుపడతాము. లౌకికులతో సహవాసం చేస్తే మనలోని దోషాలను పెంచుతారు. లౌకికులతో సహవాసం చేసే బదులు ఈశ్వరుడితో సహవాసం చేస్తే మనం బాగుపడతాము. నీవు ఏదైనా మంచిపని చేస్తే అది లోకానికి తెలియాలి అని అనుకొంటే నీకు తపస్సు లేదు అని అర్థం. నీవు